కథ

# కర్మయోగి

డా॥ కొఠారి వాణీచలపతిరావు

చేయగలిగిన చేవ గలవాడికి చేతులు ముడుచుకొని కూర్చోవల్సిన పరిస్థితి వస్తే అంతకన్నా నరకం మరొకటేముంటుంది.?

మనో సంకల్పం, జీవిత లక్ష్యం

ఏదో సాధించాలన్న ఆశయం అన్నీ అనుకోకుండా అకస్మాత్తుగా ఒకేసారి కుప్పకూలి పోతే ఆ మనిషి మానసిక స్థితి ఎంత హృదయ విదారకం!

యుద్ధంలో క్షతగాత్రుడై కుడికాలు పోగొట్టుకొని ఇంటికి చేరిన ప్రభాకరంకు ప్రపంచం అంతా శూన్యంగా కనిపించటం మొదలు పెట్టింది. లంకంత ఇల్లు ఆ యింట్లో ఏ మూలో వంట చేస్తూనో పూజ చేస్తూనో అతని ముసలి తల్లి వుంటుంది.

నోరు తెరుచుకొని వున్న పెద్ద గుహలాంటి మధ్యహాల్లో ప్రభాకరం ఒక్కడూ చేతులు ముడుచుకొని, ఖాళీగా, చేయటానికి ఏమీ లేనట్లు కూర్చొని వుంటాడు. లోతుకు పోయిన కళ్లు, పెరిగిన గడ్డం, ముఖంలో ఉదాసీనత ఇదీ అతని వాలకం.

రాను రాను ఆ యింట్లో ఒంటరితనం ప్రభాకరంను కాటు వేస్తున్నది.

నిశ్శబ్దం గుండెల మీద కరాళనృత్యం చేస్తున్నది. మనసు వైరాగ్య వైపు మొగ్గు చూపిస్తున్నది. అలాంటి స్థితిలో - ఒక రోజు ఏమీతోచక మెల్లిగా కట్టెకాలితో ఒక్కొక్క మెట్టే యెక్కుతూ డాబా పైకి వెళ్ళి కూర్చున్నాడు ప్రభాకరం.

చుట్టూ పరిసరాలను కనిపించినంత మేరకు చూపు సారించి ఆసక్తిగా చూసాడు. అలా చూస్తూ వుంటే అతని మనసులో 'ఇది నా ఊరు.' అన్న ఆత్మీయతా భావం ఓ క్షణకాలం తియ్యగా మెదిలింది. ఆ అభిమానంతోనే ఆ ఊరిని మరింత పరికించి చూసిన తర్వాత ఈసారి 'ఇదా నా ఊరు' అని అతను ఆశ్చర్యపోయాడు. ఎండిన పొలాలు. చుట్టూ పేరుకొని పోయిన దుర్గంధం- నెత్తిన కడవలెత్తుకొని ఎన్నో మైళ్ళ దూరం నుండి మంచినీళ్ళు మోసుకొస్తున్న గ్రామీణ స్త్రీలు - ఆ దృశ్యాలన్నీ కళ్ళబడి ప్రభాకర్ మనసంతా చేదుగా మారిపోయింది.

ఆలోచిస్తుంటే తన గ్రామం ఎంత వెనకబడి వుందో, తన గ్రామ ప్రజలు ఎంతటి అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతున్నారో అతనికి అర్ధమైంది. పరిస్థితి అర్ధమవటం ఆలస్యం అతని మనసులో ఒక సంకల్పం వేళ్ళూనుకుంది.

గ్రామోద్ధరణ లక్ష్యంగా గ్రామ ప్రజల సుఖశాంతులు, ఆరోగ్యం తన ఆశయంగా పిడికిలి బిగించాడు. ప్రభాకరం ఇంటి ముందు వసారాలో కమలాపురం గ్రామాధికారులు కుర్చీల్లో కూర్చుని వున్నారు. ప్రభాకరం తమను పిలిపించాడని తెలియగానే వాళ్ళు రెక్కలు గట్టుకొని అక్కడ వాలారు.

అప్పుడే లోపలినుండి బయటికి వచ్చిన ప్రభాకరం వాళ్ళకు చేతులు జోడించి నమస్కారం చేసాడు.

"నేనే మీదగ్గరికి రావల్సిన వాడిని. కానీ నడవగల పరిస్థితిలో లేనందున మిమ్మల్నే ఇక్కడికి పిలిపించవలసి వచ్చింది. క్షమించండి."

ఆ మాటలకు అక్కడ వున్న ముగ్గురూ విపరీతంగా నొచ్చుకున్నారు.

"ప్రభాకరం బాబూ మీరంటే మాకు, ఈ ఊరి ప్రజలకు అమిత గౌరవం. ఈ ఊరి మొత్తంలో చదువుకున్న వ్యక్తి ఎవరంటే, ఎవరైనా మిమ్మల్ని చూపిస్తారు. మా ఊరు మనిషి ప్రాణాలకు తెగించి దేశ రక్షణకు యుద్ధం చేస్తున్నాడని ఈ ఊరిలోని పసిపిల్ల వాడు సైతం రొమ్మువిరుచుకొని గర్వంగా చెప్పుకునే వాడు. ఆ దేవుడు చిన్న చూపు చూడటం వల్ల మీరిలా ఇంటికి చేరుకోవాల్సి వచ్చింది గానీ" - ఆ పైన మాటలు పెగలక ఆర్ధోక్తిలో ఆపేసాడు మునసబు రామిరెడ్డి.

"ప్రభాకరం బాబూ! ఈ గ్రామాధికారం ఇకనుండి మీది. మీరు కుర్చీ మీద కూర్చుని మమ్మల్నందర్నీ ఆజ్ఞాపించండి. మీరు అన్నీ తెలిసిన వారు. మీరు ఏ పని చేసినా అది గొప్పగా వుంటుంది "అన్నాడు ప్రెసిడెంట్ భూషణం. ఆ మాటలకు ప్రభాకరం చిరునవ్వు నవ్వాడు.

"నాకు ఏ పదవులూ వద్దు. అధికారాలు వద్దు. ఒక సామాన్య గ్రామస్థుడిగా వుంటూ ఈ గ్రామాన్ని బాగు చేయగల అవకాశం యివ్వండి చాలు. నిన్న ఏమీతోచక అలా మా మేడ మీదికి వెళ్ళి కూర్చుంటే చాలా దీన స్థితిలో వున్న గ్రామం, అష్టకష్టాలు పడుతున్న ప్రజలు నాకళ్ళకు కనిపించారు. అనారోగ్యం, దరిద్రం మన గ్రామాన్ని పట్టిపీడిస్తున్న దుష్టశక్తులుగా కనిపించాయి. ఎక్కడ చూసినా మురికి, అపరిశుభ్రత తాండవం చేస్తున్నాయి. పంట పొలాలతో కళకళ లాడాల్సిన భూమి పగుళ్ళు బాసి బీడులుగా మారిపోయింది. గ్రామ ప్రజల్లో ఎవరి వంక చూసినా ఏదో అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కనిపిస్తున్నారు. చినిగిన బట్టలు, లోతుకు పోయిన డొక్కలువారి దరిద్రాన్ని చెప్పక చెబుతున్నాయి. అందుకే ఈ గ్రామంలో పుట్టి, పెరిగిన నేను ఈ గ్రామ అభివృద్ధికి నా వంతు కర్తవ్యంగా ఏం చేయగలనా అని ఆలోచించాను. ఈ విషయమై మీతో సంప్రదింపు జరపాలని పిలిపించాను. చెప్పండి మన ఊరు ఇలా కావటానికి కారణం ఏమిటి? "గ్రామాధికారుల వంక ఆసక్తిగా చూస్తూ ప్రశ్నించాడు ప్రభాకరం.

చదువుకున్న వాడు, సమర్ధుడు అయిన ప్రభాకరం తమ ఊరి గురించి ఆలోచించడం, దాన్ని అభివృద్ధి చేయాలని తమను సమావేశ పరచడం ఆముగ్గురికీ ఎంతో ఉత్సాహాన్ని కలిగించింది.

ఊరి కరణం కృష్ణశర్మ ముందుగా, మాట్లాడుతూ "ప్రభాకరం బాబూ. మన ఊరు వర్షపాతం తక్కువగా వున్న ప్రాంతంలోనిది. తాగే నీళ్ళకే గతి లేదు. ఇంక పొలాలకు నీళ్ళెలావస్తాయి. నీళ్ళు లేంది పంటలు పండవు. పంటలు లేంది ప్రజలకు తిండి లేదు. ఇంక అనారోగ్యం అంటావా దానికి కారణం నువ్వన్నట్టు అపరిశుభ్రతే."

"మీరన్నది నిజం శర్మగారూ. ఆ అపరిశుభ్రతకు కారణం అజ్ఞానం. మనం పీల్చే గాలి, తాగే నీరు మన అపరిశుభ్రత వల్లే కాలుష్యం అవుతున్నాయని ఆ కాలుష్య వాతావరణమే తమ అనారోగ్యానికి కారణమని వాళ్ళకు తెలియదు. కనుక తెలిసిన మనం వాళ్ళకు తెలియ చెప్పాలి. మనం చెప్పింది వాళ్ళకు అర్ధం కావాలంటే ముందు వాళ్ళ దప్పికను, ఆకలిని మనం తీర్చగలగాలి. అప్పుడే మనం ఏం చెబుతున్నామో వాళ్ళకు బోధపడుతుంది. ఆకలి మంట మరో విషయం గురించి ఆలోచించనివ్వదు కదా!"

"మీరే మంటున్నారు ప్రభాకరం బాబూ! నీళ్ళ కరువున్న ఈ ప్రాంతంలో వాళ్ళకు నీటి సమస్య, తిండిసమస్య ఎలా తీర్చగలం?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు మునసబు.

"తీర్చగలం! ఎలాగంటే ముందు ఈ గ్రామంలో ఒక పెద్ద మంచినీటి బావిని తవ్విద్దాం. భూగర్భ జలనిపుణులను పిలిపించి నీరుపడే స్థలాన్ని గుర్తించి పాతాళం నుండైనా నీటిని రప్పిద్దాం. దానివల్ల స్త్రీలు ఎన్నోమైళ్ళు నడిచి నీళ్ళు తెచ్చుకునేఅవసరం వుండదు. ఆదా చేసిన ఆ సమయాన్ని, శ్రమను వాళ్ళు మరో పనికి వినియోగించేలా చేయవచ్చు."

"ఇది సాధ్యమయ్యే పనేనా ప్రభాకరం బాబూ! అది చాలా ఖర్చుతో కూడుకున్న పని." అని నీళ్ళు నమిలాడు ప్రెసిడెంట్.

"అసాధ్యాన్ని సాధ్యం చేయటమే మన ప్రస్తుత కర్తవ్యం. డబ్బు గురించి మీరు ఆలోచించకండి. ఆవిషయమై నేనో నిర్ణయానికి వచ్చాను." అన్నాడు ప్రభాకరం.

"ఏమిటది?" అని ప్రశ్నించారు ముగ్గురూ ఒకేసారి.

"ఈ గ్రామంలో ఎవరన్నా కాస్త డబ్బున్న వ్యక్తి వుంటే అతను నా ఈ యిల్లు కొనేలా చూడండి. ఈ ఇంటి మీద న్యాయంగా అతను ఇచ్చే ధరను ఈ గ్రామ అభివృద్ధికి ఖర్చుచేయాలన్నది నా నిర్ణయం." దృఢనిశ్చయంతో ప్రభాకరం అన్న మాటలకు శ్రోతలు ముగ్గురూ నోరెళ్ళ బెట్టి అలాగే చూస్తుండి పోయారు. ఆ సమయంలో ఆ వ్యక్తి కేవలం ఒక వ్యక్తిగా కాక సాక్షాత్తు అవతార పురుషుడిగా వాళ్ళ కళ్ళకు కనిపించాడు.

"ప్రభాకరం బాబూ! త్యాగానికయినా ఒక హద్దు వుండాలి. మీకు ఆధారమైన ఈ ఒక్కగానొక్క యిల్లును అమ్ముకుని మీరేమయిపోతారు? ఎక్కడుంటారు?" ఒక్కొక్క మాటనూ అతికష్టం మీద పలుకుతూ అన్నాడు మునసబు.


"ఈ యింట్లో వుండేది మా అమ్మ, నేను. ఇద్దరికోసం లంకంత ఈ ఇల్లు ఎందుకు చెప్పండి. మన వూరి రామాలయంలో పూజారి యింటిపక్కన వున్న ఒక

రెండు గదులు నాకు యిప్పించండి. ఒక గదిలో మేము వుంటూ, మరొక గదిని గ్రామాభివృద్ధికి సంబంధించిన కార్యకలాపాలకోసం ఆఫీసు రూముగా వినియోగిస్తాను. ఆ విధంగా ప్రజలకు మరింత దగ్గరవవచ్చు. ప్రెసిడెంట్ గారూ! మీరొక పని చేసి పెట్టండి. గ్రామ ప్రజల నందరినీ రేపు ఈ యింటిముందు సమావేశం కావల్సిం దిగా ఊరంతా చాటింపు వేయించండి. గ్రామంలోని ప్రతి వ్యక్తీగ్రహించాల్సిన అచరించాల్సిన పనులుకొన్ని వున్నాయి. దానికోసం నేనొక ప్రణాళిక తయారు చేసాను. ఆ ప్రణాళికను నేను రేపు మీ సమక్షంలో వాళ్ళ ముందు వుంచుతాను. ఆ తరువాత దానిలో జరగాల్సిన మార్పులు, చేర్పుల గురించి మనం చర్చలు చేద్దాం. ఏమంటారు?" గ్రామ పెద్దల అంగీకారం కోసం అన్నట్లు వాళ్ళ వంక చూస్తూ ప్రశ్నించాడు ప్రభాకరం, ముందుగా కరణం తేరుకొని అమాంతం ప్రభాకరాన్ని కౌగిలించుకున్నాడు.

"నువ్వు మనిషివి కాదు ప్రభాకరం బాబూ! ఇదే కాదు ఇంకా ఏమేం చేయాలో చెప్పండి. చిటికెల మీద చేస్తాను." అన్నాడు ప్రెసిడెంట్ హుషారుగా. "ప్రస్థుతానికి ఇది చాలు, ఆ తరువాత చేయాల్సింది రేపు ఆలోచిద్దాం." అన్నాడు ప్రభాకరం చిరునవ్వుతో చేతులు జోడిస్తూ.

* * *

ప్రభాకరం ఇంటిముందు ఇసుక వేసినా రాలనట్లు జన సందోహం కిక్కిరిసి వుంది. 'ప్రభాకరం బాబు యింతమంది జనాన్ని ఎందుకు పిలిపించాడు,' అన్న కుతూహలం అక్కడ వున్న ప్రతి ఒక్కరిలో తొంగిచూస్తున్నది.



"ప్రస్థుతం మన దేశం ఒక పెద్ద ప్రమాదంలో చిక్కుకొని ఉంది. మన గ్రామం అనే చిన్న అద్దంలో చూస్తే చాలు, ప్రమాదం పాలైన దేశం మొత్తం మీకు కనిపిస్తుంది. మన దేశంలో ఇప్పుడు వాతావరణం కాలుష్యం విపరీతంగా పెరిగి పోయింది. మనం పీల్చే గాలి, తినే తిండి, తాగే నీరు అన్నీ విషపూరితాలై పోతున్నాయి. మన చుట్టూ పేరుకుపోతున్న ఈ విషవలయానికి కారణం ఎవరో కాదు. మనమే. కొత్తచెట్లను పెంచవలసింది పోయి, ఉన్న చెట్లను నరుక్కుంటున్నాము. దాని వల్ల వర్షాలు కురవడం లేదు. స్వచ్ఛమైన గాలి లభించడం లేదు. భూమిని సారవంతంగా మార్చుకునే బదులు రసాయన పదార్థాలతో కూడిన పొలాల మందులు వాడి హైబ్రీడ్ తిండ్లు తిని రోగాలపాలవుతున్నాం. మీకో విషయం చెబితే ఆశ్చర్యపోతారు. ఈ మధ్య పరిశోధనల్లో తేలిన విషయం తల్లి తన కన్న బిడ్డకు ఇచ్చే పాలల్లో డి.డి.టి కల్సి వుందట. కృష్ణుడి చరిత్రలో ఎప్పుడో పూతన గురించి విన్నాం. ఇప్పుడు తన స్తన్యంలో విషం నింపుకుంటూ ప్రతి తల్లీ ఒక పూతనగా మారుతున్నది. మానవుడికి దేవుడిచ్చిన గొప్ప వరం ఈ ప్రకృతి. ఆ వరాన్ని సద్వినియోగం చేసుకోవటానికి బదులు మనం దుర్వినియోగం చేసుకుంటున్నాం. సహజవనరులు నాశనం చేసుకొని కృత్రిమత్వం వైపు పరుగులు తీస్తున్నాం. మన వృక్ష సంపదను, పశు సంపదను మనమే మట్టు పెట్టుకుంటున్నాం. సూర్య కిరణాలనుండి వెలువడే విషకిరణాలనుండి మనల్ని రక్షించే ఒజోన్ పొర వాతావరణ కాలుష్యం కారణంగా ఇప్పటికే పల్చబడిపోయింది. మరికొద్ది సంవత్సరాలలో ఈ విషకిరణాల వల్ల మనిషికి చర్మకాన్సర్, కంటివ్యాధులు వచ్చే ప్రమాదం వుంది. అందుకే నేను ఇంతగా ఆవేదన పడి చెబుతున్నాను. ముందు తరాల వారికి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఇచ్చి వెళ్ళాల్సిన బాధ్యత మనందరి మీదా వుంది. ఎవరోవచ్చి ఏదో చేస్తారని ఎదురు చూస్తూ కూర్చోవడం కన్నా ప్రయత్నించి మన వంతు కర్తవ్యాన్ని మనం నెరవేర్చాలి. ఆసంకల్పంలో భాగంగా ముందు మన గ్రామాన్ని చక్కదిద్దుకుందాం. మన గ్రామాన్ని చూసి మరికొన్ని గ్రామాలు బాగుపడితే, ముందు ముందు ఈ దేశం మొత్తమే బాగుపడి పోతుంది. అందుకు మీ అందరి సహకారం నాకు కావాలి. పట్టుదలతో మనం అందరం కల్సి మన ఊరిని స్వర్గంగా మలుచుకుందాం. ఏమంటారు? "అంటూ తన మాటలుఅమాయక ప్రజల మీద ఎలాంటి ప్రభావం చూపాయోనని అందరి వంక ఆసక్తిగా చూస్తుండి పోయాడు ప్రభాకర్.

అంత వరకూ చెవులప్పగించి, నోరెళ్ళ బెట్టి ఆశ్చర్యంగా ప్రభాకరం మాటలను వింటున్న జనం అంతా అకస్మాత్తుగా మరోలోకం నుండి అప్పుడే తమలోకానికి ఊడి పడ్డట్లు ఒకరి ముఖాలొకరు చూసుకొని బుగ్గలు నొక్కుకున్నారు.

"ప్రభాకరం బాబూ! ఇన్ని పెద్ద పెద్ద విషయాలు మీకెలా తెలుసు. మాకు ఇయేవీ తెల్వావు." అన్నాడు ఒక వృద్ధుడు అభిమానంగా ప్రభాకర్ వంక చూస్తూ.

"రోజా పేపరు చదివితే... పుస్తకాలు చదివితే అందులో ఈ విషయాలన్నీ వుంటాయి రంగయ్యా. అసలు మన అజ్ఞానమే మన సమస్యలకు మూలం అని నా నమ్మకం. అందుకే ఈ గ్రామ ప్రజలైన మీలో కొంతైనా అజ్ఞానం తొలగించే ప్రయత్నంలో భాగంగా రాత్రి బడి పెట్టాలని అనుకుంటున్నాను. ముందు శిథిలావస్థలో వున్న మన స్కూలును ఉద్ధరించి అందులో మళ్ళీ పిల్లల చదువు కొనసాగేలా చూస్తాను. మీరందరూ మీమీ పిల్లల్ని బడికి పంపించాలి."

"రాత్రి బడి పెడతారట...వెళ్దామా మంగమ్మా" అని రహస్యంగా చెవిలో అడిగింది యాదమ్మ

"ఎళ్ళందే మనకు ఆ దొరకు తెలిసినట్లు గొప్ప గొప్ప విషయాలు ఎలా తెలస్తాయి. మనం పొలాలకు కొట్టే పురుగు మందు తిరిగి మన చనుబాలల్లోనే చేరుతోందని ఆ ఇషాన్నే మనం పిల్లలకు తాగిత్తన్నామని ఆ దొర చెప్పందే మనకు తెలిసేదేనా?" అంది మంగమ్మ ఆశ్చర్యం నుండి ఇంకా కోలుకోనట్లు.

అక్కడ కూర్చున్న జనంలో కొత్తగా కలిగిన చైతన్యం తాలూకు అలజడిని సద్దు మణుగ చేసే ప్రయత్నంలో లేచి నిల్చున్నాడు ఊరి ప్రసిడెంట్ భూషణం.

"మీరంతా నిశ్శబ్దంగా ఉండండి. ప్రభాకరం బాబు చెప్పాల్సింది ఇంకా పూర్తి కాలేదు. మన ఊరి బాగు కోసం తన యింటిని, ఆస్తిని ధారపోస్తున్న ఆ త్యాగమూర్తి మాటలను శ్రద్ధగా విని ఆయన చెప్పినట్లు చెయ్యండి." అన్నాడు.

"చెప్పండి ప్రభాకరం బాబూ. మీరు ఏది చేయమంటే అది చేస్తాం' అన్నారుఏక కంఠంతో పెద్దాచిన్నా.

"మన ఊరు బాగుకోసం నేను బాగా ఆలోచించి ఒక ప్రణాళిక తయారు చేసాను. నేను కేవలం ప్రణాళికను మాత్రమే ఇవ్వగలను. దాన్ని అమలు పరచాల్సింది మనం అందరం కల్సి. నా ఒక్కడి వల్ల సాధ్య మయ్యే పనికాదు అది. నా ప్రణాళికను శ్రద్ధగా వినండి.

"మొదటిది మన గ్రామంలో ఎవ్వరూ చెట్లు కొట్టకూడదు. ఒక రోజును మనం అందరంకల్సి 'చెట్లునాటే దినంగా'గా పాటిద్దాం. మంచి మొక్కలను తెప్పించి ఇచ్చే బాధ్యత నాది. ఈ గ్రామంలోని ప్రతి వ్యక్తీ ఒక మొక్కను నాటి అది పెరిగి పె ద్దై

చెట్టు అయ్యేవరకు అతడు దానిపోషణ భారాన్ని వహించాలి.

"ఇక రెండవది. ఈ గ్రామంలో ఎవరూ ఇక ముందు చుట్ట, బీడీ, సిగరెట్టు లాంటివి తాగ కూడదు. మద్యం సేవించకూడదు. అలా అని ఈ రోజే ప్రమాణం చేయండి. దీనివల్ల వాతావరణం కలుషితం కాక పోవడం, ఆరోగ్యం బాగుపడడం, డబ్బు ఆదా కావటం అనే లాభాలు ఉన్నాయి.

ఇక మూడోది. మన గ్రామం పంటపొలాలతో, పచ్చటి గడ్డితో నిత్యం కళకళ లాడాలన్నది నా ఆశయం. ఆ ఆశయం నెరవేరాలంటే మీరెవ్వరూ పశువులను బయట మేప కూడదు.

ఇంక నాలుగోది మన గ్రామంలో నీటి సమస్య అధికంగా వుంది. తాగటానికి మంచినీటి బావినితవ్వించుకుందాం. ఇదికాక మన ప్రాంతంలో పడే కొద్దిపాటి వర్షాన్ని మనం నిలవచేసుకుందాం.

ఇక ఐదవది మన పంటలకు రసాయనిక ఎరువులు, పురుగుమందుల బాధ లేకుండా సారవంతమైన భూమి, సహజమైన ఎరువులతో బలవర్ధకమైన విత్తనాలు వాడి మంచి దిగుమతులను సాధిద్దాం. ఐదు నియమాలతో కూడిన ఈ ప్రణాళికను అందరూ ఆచరిస్తే ప్రతి ఒక్కరూ అపరి శుభ్రతను, అనారోగ్యాన్ని తమ పరిసరాలనుండి పారద్రోలటమే లక్ష్యంగా పెట్టుకుంటే ఇంకా కొద్దికాలంలోనే మన గ్రామం స్వర్గంగా మారుతుందన్నది నా గట్టి నమ్మకం.' అన్నాడు. ప్రభాకర్ ధృడ సంకల్పంతో.

* * *

ఒక సంవత్సరమైనా తిరగక ముందే రామాపురం గ్రామంలో పెద్ద మార్పు వచ్చింది. ఏడాది తర్వాత ఆ ఊరు వచ్చిన పొరుగూరి వ్యక్తులు ఆ గ్రామాన్ని గుర్తు పట్టలేక పోతున్నారు.

ఎక్కడ చూసినా పంట పొలాలు - పచ్చిక బయళ్ళు, కళకళలాడుతున్న ముఖాలతో స్త్రీలు - కండలు పట్టిన శరీరాలతో పురుషులు ఎప్పుడూ ఏవో పనులతో హడావుడీగా తిరుగుతుంటారు. చుట్ట తాగుతూ రచ్చ బండ మీద కబుర్లు చెప్పుకునే రోజులు పోయాయి. ఇరుగిళ్ళకు పొరుగిళ్ళకు వెళ్లి అమ్మలక్కలు చెప్పుకునే ముచ్చట్లకు కాలం తీరిపోయింది.

పిల్లలు బడికి వెళ్ళి చదువుకుంటున్నారు. రాత్రిళ్ళు నిద్రమాని అలసటను సైతం అలక్ష్యం చేస్తూ పలక బలపం పట్టుకొని రామాలయంలో ప్రభాకరం ముందు బాసింపట్లు వేసుకొని కూర్చుంటున్నారు పెద్దలు.

ప్రభాకరం తల్లి శాంతమ్మకు అందంతా చూస్తుంటే కన్నుల పండుగలా వుంది.

ఒకప్పుడు యుద్ధవీరుడైన తన కొడుకు ఇప్పుడు కర్మ వీరుడై విజృంభిస్తుంటే తాను ఒక వీరమాతలా గర్వించింది ఆమె.

కానీ అంత ఆనందంలోనూ ఆ తల్లి హృదయం అసంపూర్ణమైన తనకొడుకు వ్యక్తిగత జీవితాన్ని తలుచుకొని బాధ పడుతుంది ఎప్పుడూ.

ఎన్నోసార్లు చెప్పి చూసింది ఆమె.

"నాయనా. ఇలా ఒంటరిగా ఎంతకాలం వుంటావ్. జీవితంలో నీకూ ఒక తోడు వుంటే చూసి నేను ఆనందిస్తాను రా' అని.

ఆమె మాటల్ని ప్రభాకరం ఎప్పుడూ శ్రద్ధగా విన్నట్లు కనిపించడు. విన్నా దాన్ని గురించి ఆలోచించినట్లు అసలు కనిపించడు. "అమ్మా! నీ పిచ్చి గానీ నేను తోడు లేని ఒంటరివాణ్ణి కావడం ఏమిటి? నువ్వున్నావు. ఈ గ్రామ ప్రజలు ఇందరు వున్నారు. అయినా ఇప్పుడు నా మనసు, శరీరం అన్నీ ఈ గ్రామానికి అంకితమై పోయి ఉన్నాయి. ఇప్పుడు నా ధ్యాసను మరో విషయం మీదికి మళ్ళించుకు!' అని విషయాన్ని దాటేసే వాడు.

* * *

ఆ రోజు ఉదయం పేపర్ తిరగేస్తుంటే పేపరు రెపరెపల శబ్దంతో పాటు సన్నగా ఏదో స్వరం ప్రభాకరం చెవిలో పడింది. పేపరును కదలకుండా పట్టుకొని చెవులు రిక్కించి ఆలకించాడు.

ఎవరో స్త్రీ సన్నగా రోదిస్తున్న శబ్దం. పేపరు అక్కడ వదిలి ఒంటికాలిమీద కుంటుతూ శబ్దం వస్తున్న వైపు వెళ్ళాడు. పెరట్లో అరుగు మీద కూర్చుని కనకాంబరాలు మాల కడుతున్న పూజారి కూతురుజానకిది ఆ రోదన స్వరం. తెల్ల చీరతో, బోసి ముఖంతో... జీవితంలో సర్వస్వాన్ని పొగొట్టుకున్నట్లున్న ఆమె ప్రభాకరంను చూడగానే చటుక్కున పూల పళ్ళెంతో సహాలోపలికి వెళ్ళబోయింది.

"జానకి గారూ ప్లీజ్, వెళ్ళిపోకండి మెట్లు ఎక్కి మీతో పాటు నేను రాలేను" అన్న మాటలు వెనకనుండి వినబడి తక్కున ఆగిపోయింది. అలా ఆగడంలో ప్రభాకరం పట్ల జాలి కనిపించింది ఆమెలో.

"జానకిగారూ. మీరు ఎందుకు ఏడుస్తున్నారు?

"ప్రభాకరం గారూ. మీరంటే నాకు గౌరవం. అలాంటి మీ ముందు నా ఏడ్పుకు కారణం చెప్పుకుంటే నా మనసూ కొంత ఊరట పొందుతుంది. ఏమీ లేదండీ. చిన్న విషయం. దేవాలయంలో అమ్మవారి పూజకోసం రోజూ పూల మాల కట్టి మా నాన్నకు యిస్తూ వుంటాను.

ఎర్రటి ఈ కనకాంబరాలు చూస్తే నాకు ప్రాణం లేచి వస్తుంది. అందరు అమ్మాయిల్లా నాకూ ఈ పూలదండను తలలో పెట్టుకోవాలనిపిస్తుంది. కానీ మా అమ్మ కి కోపం వస్తుంది. 'మొగుడు పోయిందానివి నువ్వు పూలు, బొట్టు పెట్టుకోవడం ఏమిటే, అంటుంది. కానీ ఒక్కసారంటే.... ఒక్కసారి అయినా పూలు బొట్టు పెట్టుకొని పట్టు పరికిణీ కట్టుకోవాలని వుంటుంది" పైట చెంగుతో కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అంది జానకి. చిన్న విషయం అన్న జానకి దఃఖ కారణం ఎంత పెద్దవిషయమో... ఆ అమాయకురాలి చిన్న కోరిక ఎంతగా హృదయాన్ని పిండేసేదో బహుశ ఆ అమ్మాయికి తెలియదు. ప్రభాకరం హృదయం అర్థమయింది.

బోసిపోయిన ఆమె ముఖం తనకేదో కర్తవ్యాన్ని స్ఫురింపచేసినట్లు అయింది.

గ్రామాన్ని ఉద్ధరించటానికి కంకణం కట్టుకున్న తాను తన పక్కనే వుంటూ సంప్రదాయపు సంకెళ్ళలో జీవిత ఖైదీఅయిన సాటివ్యక్తిని ఉద్ధరించాలన్న ఆలోచన రానందుకు సిగ్గుపడ్డాడు.

ఈ గ్రామంలో ఇంకా ఇలాంటి స్త్రీలు ఎంతమంది వున్నారో? తను ఇప్పుడు జానకి జీవితాన్ని బాగు చేయగలిగితే అది మరెందరి భవిష్యత్తుకో అంకురార్పణ కావచ్చు. అన్న ఆలోచన ప్రభాకర్‌ను ఒక చోట స్థిమితంగా నిలవనీయలేదు ఆరోజంతా.

ఆ రాత్రి భోజనాల దగ్గర తల్లితో అన్నాడు.

"అమ్మా! ఎప్పుడూ 'పెళ్ళి చేసుకోరా' అంటూ గోలపెట్టే దానివి. ఈ మధ్య ఏమిటి ఆ విషయం ఎత్తటం లేదు! అన్నాడు." శాంతమ్మ అనుమానంగా కొడుకు వంక చూసింది.

"ప్రభూ - నిజమా... నువ్వు పెళ్ళి చేసుకోవటానికి ఒప్పుకుంటున్నావా?" ఆశర్యపోయింది శాంతమ్మ.

"నిజం అమ్మా - కానీ ఒక కండిషన్. నేను కోరుకున్న అమ్మాయితోనే నా పెళ్ళి జరగాలి."

ఈసారి మరింత ఆశ్చర్యపోయింది శాంతమ్మ. 'తన కొడుకేమిటి ప్రేమలో పడటం ఏమిటి' అనుకుంది.

"ఎవర్రా ఆ అమ్మాయి"? అంది చిరునవ్వుతో.

"పూజారి గారి కూతురి జానకి అమ్మా. ఆ అమ్మాయికి కూడా నేను యిష్టమో, కాదో తెలుసుకో. ఆమె తల్లిదండ్రులు అంగీకరిస్తే జానకి నీ కోడలు అవుతుందమ్మా "అన్నాడు ప్రభాకరం.

విషయం అర్థమైంది శాంతమ్మకు.

"తన కొడుకు ఏ పని చేసినా అందులో ఏదో ప్రత్యేకత వుంటుంది. మరేదో మంచితనం వుంటుంది 'అని మరోసారి ఆమె గర్వంగా అనుకుంది.

వారం రోజుల తర్వాత

జానకి, ప్రభాకరంల వివాహం సీతారాముల సమక్షంలో జరిగిపోయింది.

పసుపు బట్టల్లో, తల నిండా పూదండలతో కళకళ లాడిపోతున్న కూతుర్ని చూసి ఆనందం పట్టలేక కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు పూజారి దంపతులు. కోడల్ని పదే పదే చూసుకొని మురిసిపోయింది శాంతమ్మ.

గ్రామ ప్రజల హృదయాలలో ప్రభాకరం మరింత ఎత్తు ఎదిగిపోయాడు ఈ సంఘటనతో.

**[కథకి మూల వృత్తం అందించిన ప్రొఫెసర్ పురుషోత్తమరెడ్డి గారికి కృతజ్ఞతలతో - రచయిత్రి]**

❐